

29న ఎస్సీ,ఎస్టీ నిఘా కమిటీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 29 బుధవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్, ఛైర్మెన్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో సాంఘీక సంక్షేమశాఖాధికారి పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఎస్సీ, ఎస్టీ నిఘా, పర్యవేక్షణ కమిటి సభ్యులు కోవిడ్ నిబంధనలు పాటిస్తూ పాల్గొన్నాలని పేర్కొన్నారు.

నగరాభివృద్ధికి రూ.100 కోట్లు

- నగర పాలక సంస్థ బడ్జెట్ అంచనా రూ.273.12 కోట్లు- మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ 2023-24 సంవత్సరం బడ్జెట్ అంచనాలను రూ.273.12కోట్లతో రూపొందించినట్లు నగర మేయర్ ఎస్.అముద తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం మంగళవారం నగరపాలక సమావేశ మందిరంలో నగర మేయర్ ఎస్.అముద అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన బడ్జెట్ అంచనాలను కౌన్సిల్ ఆమోదించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో నగరపాలక సంస్థకు సాధారణ, మూలధన జమల ద్వారా రూ.273,12,35,033 వస్తుండగా, రూ.195,01,25,860 సాధారణ మూలధనం వ్యయంగా అంచనా వేశారు. ఎక్స్అఫీషియో సభ్యుల హోదాలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సభకు హాజరయ్యారు. బడ్జెట్ సమావేశం సందర్భంగా నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ నగరపాలక సంస్థ బడ్జెట్ ప్రాధాన్యత అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కౌన్సిల్ సభ్యులకు వివరించారు. ఈ బడ్జెట్‌లో నగరంలో రోడ్లు, వీధి దీపాలు, నీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుధ్యం అంశాలపై ప్రత్యేకశ్రద్ధ పెట్టనున్నట్లు కమిషనర్ వివరించారు. విలీన పంచాయతీల్లో అభివద్ధి పనులకు ప్రాధాన్యత ఇచ్చినట్లు వివరించారు. చిత్తూరు శాశ్వత తాగునీటి సరఫరా కోసం ఉద్దేశించిన అడవిపల్లి రిజర్వాయర్ పనులు వేగంగా జరుగుతున్నాయని, ఇందులో భాగంగా ఏడు ఈఎల్ఎస్ఆర్ ట్యాంకులు మంజూరు అయినట్లు కమిషనర్ వివరించారు. అనంతరం ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం, ప్రణాళిక, రెవెన్యూ, మెప్మా, సాధారణ పరిపాలన, వార్డు సచివాలయాలు అంశాలపై శాఖాధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్

ప్రతి వార్డులోను అభివద్ధి పనులు..

నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి వార్డులోనూ అభివద్ధి పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నట్లు నగర మేయర్ ఎస్.అముద చెప్పారు. నగరపాలక సంస్థ అత్యవసర కౌన్సిల్ సమావేశం మంగళవారం మధ్యాహ్నం జరిగింది. చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. గడపగడపకు మన ప్రభుత్వం, ఇతర ప్రభుత్వ నిధుల ద్వారా అన్ని వార్డుల్లో ప్రాధాన్యత క్రమంలో అభివద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ.. నగరంలో అభివద్ధి పనుల కోసం ఇటీవలే రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసి చర్చించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నగరాభివద్ధికి రూ.100 కోట్లు నిధులు మంజూరు చేయడానికి ముఖ్యమంత్రి అంగీకారం తెలిపారని వివరించారు. వీటితోపాటు నగరంలోని ఐదు ప్రధాన రహదారులను రూ.20కోట్లతో అభివద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. నగర పరిధిలోని ప్రధాన వార్డులతో పాటు, విలీన పంచాయతీల్లో రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈసమావేశంలో భాగంగా కౌన్సిల్ సభ్యులు వార్డు పరిధిలో పలు సమస్యలను తెలియజేశారు. కార్పొరేటర్లు తెలియజేసిన సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ అరుణ తెలియజేశారు. అత్యవసర సమావేశంలో భాగంగా పలు అజెండా అంశాలపై సభ్యులు చర్చించి ఆమోదించారు. ప్రధానంగా నగర పరిధిలోని సీబీఐ రోడ్డు (కార్నేర్స్ బంగాళ రోడ్డు) పేరును బిఎస్ కణ్ణన్ రోడ్డుగా నామకరణం చేయడానికి, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్-2016 మేరకు తేనెబండ వద్ద సీ అండ్ డీ వేస్ట్ ప్లాంట్ నిర్మాణం కోసం ఏజెన్సీని గుర్తించి ఆమోదించడం, నగరపాలక సంస్థ వాహనాల షెడ్ ఎదురుగా ఉన్న స్థలంలో ఎక్స్ సర్వీస్ మెన్ యూనియన్ అభ్యర్థుల మేరకు సైనికుల జ్ఞాపకార్థమై స్థూపం ఏర్పాటు చేయుటకు స్థలం కోసం తహశీల్దార్‌కి పంపుటకు, నగరంలోని కూరగాయల మార్కెట్, జంతు వధశాల, ఎన్టీఆర్ బస్టాండ్, కాసు బ్రహ్మానందరెడ్డి బస్టాండ్లకు 2023-24 సంవత్సరానికి బహిరంగ వేలంపాట నిర్వహించడానికి ఆమోదించారు. వీటితోపాటు టేబుల్ అజెండాగా నీటిసరఫరా నిబంధనలు, 1,2,50 డివిజన్లకు సంబంధించి 50వ డివిజన్లోని అంగన్వాడీ కేంద్రం స్థలంలో ఆర్వో మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకు, 33,34,35 వార్డులకు సంబంధించి ఆర్టీసీ డిస్పెన్సరీ ఎదురుగా ఉన్న స్థలంలో ఆర్వో మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు తదితర అంశాలకు కౌన్సిల్ ఆమోదించింది. సమావేశంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, ఎంఈ ధనలక్ష్మీ, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, ఏసీపీ రామకష్ణుడు, మేనేజర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, సీఎంఎం గోపి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



బడ్జెట్ వివరాలను తెలియజేస్తున్న నగర కమిషనర్ అరుణ



బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్లు

కోనేట్లో ఈతకు వెళ్లి...

ముగ్గురు విద్యార్థులు దుర్మరణం

దేవదొడ్డి గ్రామంలో విషాదం

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి

చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలం దేవదొడ్డి గ్రామం నుంచి గంగమ్మ జాతరకు వెళ్లిన ముగ్గురు విద్యార్థులు కోనేట్లో ఈతకు వెళ్లి మృతిచెందారు. ఈ ఘటనతో దేవదొడ్డి గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. విద్యార్థి గౌతమి మృతదేహాన్ని ఎంఇఒ, ఉపాధ్యాయులు సందర్శించి నివాళి అర్పించారు. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం కోట్రేపల్లిలోని కాలభైరవస్వామి కొండ పక్కన గంగమ్మ జాతర జరుగుతోంది. కదిరప్ప కుటుంబానికి మొక్కు ఉండడంతో బంధుమిత్ర, కుటుంబ సమేతంగా వెళ్లారు. కుటుంబ సభ్యులు పూజలో నిమగ్నమై ఉండగా కదిరప్ప కుమార్తె గౌతమి (13), తమిళనాడుకు చెందిన ఆరట్ల గ్రామం నుండి జాతరకు వచ్చిన సుబ్రమణ్యం కుమార్తె భవ్య (17), వెంకటరమణ కుమార్తె మౌనిక (13)జాతర దగ్గర కనిపించకపోవడంతో కొలను దగ్గర వెతికారు. గౌతమి, మౌనికలు ఎనిమిదో తరగతి చదువుతున్నారు. కోనేట్లో ఈత కొట్టడానికి వెళ్లారని చుట్టుపక్కలవారు కుటుంబ సభ్యులకు తెలపడంతో వెతికి మూడు మృతదేహాలను బయటకు తీశారు. హుటాహుటిన బైరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే ముగ్గురు మృతిచెందినట్లు తెలిపారు. ఈ ఘటనతో దేవదొడ్డి గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. దేవదొడ్డి మోడల్ స్కూల్లో చదువుతున్న గౌతమి మృతితో పాఠశాల ఉపాధ్యాయులు, స్నేహితులు, విద్యార్థులు విచ్చేసి శోకసంద్రంలో మునిగిపోయారు. మండల విద్యాశాఖ అధికారి సాయిలీల, సిఆర్‌పిలు నివాళి అర్పించారు. భవ్య, మౌనికల మృతదేహాలను తమిళనాడు రాష్ట్రం ఆరట్ల గ్రామానికి తీసుకెళ్లి అంత్యక్రియలు పూర్తి చేశారు.



బడ్జెట్‌లో నిధుల కేటాయింపు సరే

మురికివాడల అభివృద్ధి ఏదీ : సిపిఎం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగర పాలక సంస్థ 2023- 24 బడ్జెట్‌లో కేటాయించిన ప్రకారం మురికివాడల అభివృద్ధి కోసం 40శాతం, అలాగే ఎస్సీ, ఎస్టీల కేటాయింపులు, స్త్రీశిశు సంక్షేమం, విభిన్న ప్రతిభావంతుల కోసం బడ్జెట్‌లో కేటాయించిన ప్రకారం ఖర్చు చేయాలి అలాగే చిత్తూరు కార్పొరేషన్ పరిధిలో శాశ్వత తాగునీటి కోసం కేటాయింపులు పెంచి, ప్రజలపై యూజర్ ఛార్జీల భారం తగ్గించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగారాజు, నగర కార్యదర్శి సురేంద్రన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరపాలక సంస్థ బడ్జెట్ కేటాయింపుల్లో ప్రధానంగా మురికివాడల అభివృద్ధి కోసం ఏటా నిధులు కేటాయిస్తున్నా ఆ మేరకు ఖర్చు చేయడం లేదన్నారు. నగరపాలక సంస్థ గుర్తించిన మురికివాడల్లో వీధిలైట్లు, తాగునీరు, డ్రైనేజీ రోడ్లు వంటి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. నేటికి అనేక వీధులు సీసీ రోడ్లుకు నోచుకోలేదని అలాగే ఎల్ఈడీ పేరుతో ఏర్పాటు చేసిన వీధిలైట్లు పనిచేయడం లేదని, నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో పబ్లిక్ టాయిలెట్స్ లేక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోందని, అస్థవ్యస్థమైన డ్రేనేజీ వ్యవస్థలతో నిత్యం ప్రజలు అల్లాడుతున్నట్లు తెలిపారు.

ఉజ్వల భవిష్యత్తుకు పది కీలకం

- పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు
- ఏకాగ్రతతో మంచి మార్కులు



ప్రజాశక్తి - నగరి: చదువులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే పదో తరగతి అత్యంత కీలకం, ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు ఇదే.. ఈసమయాన్ని వేస్ట్ చేయకుండా బట్టీ విధానానికి స్వస్తి చెప్పి... ప్రణాళికబద్ధంగా చదివితే మంచి మార్కుతో పదికి పది గ్రేడ్ పాయింట్లు సాధించవచ్చు అని ఉపాధ్యాయులు అంటున్నారు. ఇప్పటికే పదో తరగతి విద్యార్థులు ఫైనల్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక ప్రణాళికతో సిద్ధమవుతున్నారు. పదికి పది గ్రేడ్ పాయింట్లు (జీపీఏ) సాధించేందుకు ప్రత్యేకంగా సాధన చేస్తున్నారు.

నగరి మండలంలో 1172 మంది విద్యార్థులు

మండలంలో 10వ తరగతి విద్యార్థులు 1172మంది పరీక్షలకు సిద్ధమవుతున్నారు. వీరందరికీ ప్రైవేటు పాఠశాలకు దీటుగా విద్యాబోధన అందిస్తూ, ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయ బందం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యాలను తీర్చిదిద్దే కార్యక్రమంలో ఉపాధ్యాయులు నిమగ్నమయ్యారు.

ప్రత్యేక తరగతులు..

ఇప్పటికే పదో తరగతి పరీక్షల షెడ్యూల్‌ను విద్యాశాఖ ప్రకటించింది. ఏప్రిల్ 3వ తేదీ నుంచి పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అలాగే విద్యలో వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

పట్టుదలతో చదవాలి..

ఇంగ్లీష్ రాదు, మ్యాథ్స్ అంటే కష్టం అనే భావన మనసులో పెట్టుకోకూడదు. ప్రతి సబ్జెక్టును విద్యార్థులు ఇష్టపడి చదవాలి. ఏ సబ్జెక్టులోనైనా అనుమానాలుంటే వెంటనే ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు లేదా తోటి విద్యార్థులతో చర్చించుకుంటే అత్యధిక మార్కులు సాధించేందుకు అవకాశం ఉంటుంది. వందకు వంద మార్కులు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంటే మారిన పరీక్షా విధానంతో కనీసం 80శాతం మార్కులైన సాధించవచ్చని అంటున్నారు.

మెలకువలతో ఉత్తమ ఫలితాలు

పరీక్షల్లో విద్యార్థులు మెళకువలు పాటిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని నిపుణులు చెబుతున్నారు. సమాధాన పత్రంలో చేతిరాత చక్కగా ఉండాలి. కొట్టి వేతలు, అక్షర దోషాలు లేకుండా చూసుకోవాలి. ప్రశ్నాపత్రం ఇవ్వగానే ప్రశాంతంగా ప్రశ్నలు బాగా చదివి అర్థం చేసుకోవాలి.

శ్మశాన వాటికల

భూసేకరణ పూర్తిచేయండి : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: దళిత వాడలలో శ్మశాన వాటికల ఏర్పాటు నిమిత్తం గుర్తించిన భూమికి హద్దులు నిర్ణయించే ప్రక్రియను పూర్తిచేయాలని, రీసర్వేలో భాగంగా సర్వేరాళ్లు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం జిల్లా సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్‌డిఓలు, తహశీల్దార్లుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దళితవాడలలో శ్మశాన వాటికలకు భూములను గుర్తించే ప్రక్రియ వేగవంతంగా నిర్వహించి పూర్తి చేయాలని అన్నారు. రీసర్వేకి సంబంధించి సర్వేరాళ్లు నాటే ప్రక్రియను సర్వేరాళ్లు వచ్చిన మండలాలలో వేగవంతంగా చేయాలన్నారు. ఈ అంశానికి సంబంధించి వెనుకబడిన మండలాల వారీగా సమీక్షించి పురోగతికి సంబంధించి తగిన సూచనలు జారీ చేశారు. ఈవీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌ఓ రాజశేఖర్, కలెక్టరేట్ లోని వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

'ఉద్యోగం పేరుతో దోచుకున్నారు'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాధవన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తానంటూ రూ.4లక్షలు తీసుకొని మోసం చేయడమే కాకుండా తనను హత్య చేసేందుకు ప్రయత్నిస్తున్నారని పూతలపట్టు నియోజకవర్గం తోటవారిపల్లెకి చెందిన మాధవన్ అనే యువకుడు మంగళవారం మీడియాను ఆశ్రయించాడు. గంగాధర నెల్లూరు నియోజకవర్గంకి చెందిన ఎస్ఎస్ కొండకి చెందిన ఉమాశంకర్ రెడ్డి అనే వ్యక్తి హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తానని రూ.4 లక్షల తీసుకుని మోసం చేసినట్లు వాపోయాడు. ఈవిషయంపై తనకు న్యాయం చేయాలని అభ్యర్థించారు. మాధవన్ మాట్లాడుతూ రెండు నెలల క్రింత జీడీనెల్లూరు నియోజకవర్గానికి చెందిన ఉమాశంకర్‌రెడ్డి అనే వ్యక్తి పరిచయం అయ్యాడని, అతనికి పోలీసు శాఖలోని అధికారులతో సంబంధం ఉందని.. ఇప్పటికే పలువురికి హోంగార్డుగా ఉద్యోగాలు ఇప్పించినట్లు నమ్మబలికాడని తెలిపారు. దీంతో అతనిపై ఉన్న నమ్మకంతో హోంగార్డు ఉద్యోగం కోసం 4 లక్షలు ఇచ్చానని వాపోయాడు. ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పిన అతడు నకిలీ గుర్తింపు కార్డు ఇవ్వడంతో అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశానని దీంతో ఉమాశంకర్‌రెడ్డి తనను హత్య చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్న బాధితుడు తనకు రక్షణ కల్పించాలని కోరారు.

ఏప్రిల్ 1వ తేదీ నాటికి

వైఎస్సార్ ఆరోగ్యశ్రీకి నాలుగేళ్లు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

ఆరోగ్యమే మహాభాగ్యం అంటూ వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాముఖ్యతను ఇస్తూ పేదలకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. పేద, మధ్య తరగతి వర్గాలకు పెద్దపెద్ద జబ్బులు వస్తే వారు ఆర్థిక స్తోమత లేక తల్లడిల్లిపోయే పరిస్థితి ఉండేది. అయితే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నేడు ఎన్నో వేల కుటుంబాలకు ఆరోగ్యభరోసా కల్పిస్తోంది.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక అప్పటివరకు ఉన్న రాజీవ్ ఆరగ్యశ్రీ పథకం స్థానంలో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పేరుతో 2019 నుంచి అమలు చేస్తోంది. వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీకార్డులను అందజేశారు. 2023 ఏప్రిల్ ఒకటో తేదీ నాటికి వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ఏర్పాటు చేసి నాలుగేళ్ళు పూర్తి అవుతుంది. ఈ సందర్భంగా వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం అమలు తీరుతెన్నులపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం...



మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2007 ఏప్రిల్ 1న రాజీవ్ ఆరోగ్యశ్రీ అనే పేరుతో ఈ పథకాన్ని ప్రారంభించారు. 2019 జూన్ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీగా ఈ పథకం రాష్ట్రంలో అమలు అవుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైద్యసేవలను విస్తతం చేస్తూ ఈపథకం కింద ప్రతి బీపీఎల్ కుటుంబానికి ఉచిత ఆసుపత్రి సేవా, ఈక్విటీ యాక్సెస్ సౌకర్యం కల్పించారు. ఈ పథకం ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 5లక్షల వరకు కవరేజీ అందిస్తున్నది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ అమలులో జవాబుదారీతనం, పారదర్శకత పెంపొందించడంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖను మరింత బలోపేతం చేస్తూ ఖాళీగా ఉన్న డాక్టర్లు, ఇతర పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నది.

ఆరోగ్యశ్రీ పథకం అమలులో ఆరోగ్య మిత్రలు మరింత మెరుగ్గా వ్యవహరించి రోగి ఆసుపత్రిలో చేరిన దగ్గర నుంచి డిశ్చార్జ్ అయ్యేవరకు అండగా నిలిచేలా పనిచేసే విధంగా ప్రభుత్వం కషి చేస్తుంది. ప్రస్తుతం డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం కింద 2,446 చికిత్సలను ఉచితంగా వైద్యసేవలు అందించడం జరుగుచున్నది. రోగి వైద్యం ఖర్చు రూ.1000లు దాటితే ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. ఈ పథకం కింద తెలంగాణా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలోనూ వైద్యం చేయించుకునే అవకాశంను ప్రభుత్వం కల్పించింది. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంను సమర్థవంతంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందుకు అనుగుణంగా బడ్జెట్‌లో నిధులను కేటాయించడం జరుగుతోంది.

2021- 22 ఏడాది కాలంలో ఉమ్మడి జిల్లాలో 3,561 మందికి వైద్యసేవలు అందించారు. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అత్యంత ప్రాధ్యానత ఇస్తున్న ప్రభుత్వం 716 జబ్బులకు వర్తించేలా ఆరోగ్య పథకాన్ని విస్తరించింది. రాష్ట్రంలోని ఆసుపత్రులతో పాటు చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లోని కార్పొరేట్ ఆసుపత్రుల్లో కూడా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సేవలు పొందే అవకాశాన్ని కల్పించింది. ఆరోగ్యశ్రీ పథకం వర్తించే ప్రైవేట్ వైద్యశాలల్లో ఆరోగ్యశ్రీ కార్డు కలిగిన వారికి ప్రభుత్వ నిబంధనల మేరకు వైద్య పరీక్షలు, వైద్య సేవలు ఉచితంగా అందిస్తోంది.

వైఎస్సార్ ఆరోగ్య ఆసరా..

ఈ పథకం కింద శస్త్రచికిత్సల అనంతరం వైద్యులు సూచించే విశ్రాంతి సమయానికి రోజుకు రూ.225లు లేదా నెలకు గరిష్టంగా రూ.5వేలు వరకు అందివ్వడంతోపాటు ఆరోగ్య ఆసరా పరిధిని 1,519కి చికిత్సలకు ప్రభుత్వం పెంచింది.

డాక్టర్ వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్..

అధునాతన సౌకర్యాలతో కూడిన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు ప్రభుత్వ ఆసుపత్రులలో సుఖప్రసవాలు పొందిన అక్కచెల్లెమ్మలకు క్షేమంగా వారి ఇంటికి చేరుస్తూ సిజేరియన్ కాన్పుకు రూ.3వేలు సహజ ప్రసవానికి రూ.5వేలు చొప్పున డాక్టర్ వైయస్సార్ ఆరోగ్య ఆసరా కింద ఇస్తూ వారి ఇంటికి క్షేమంగా చేరుస్తున్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కింద ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2019- 20 కింద 49,921మందికి శస్త్రచికిత్సలు చేయగా.. అందుకు రూ.110కోట్లు, వైఎస్ఆర్ ఆరోగ్య ఆసరా కింద 5,282 మందికి రూ.2.95కోట్లు, 2020-21లో 69,810 మందికి శస్త్రచికిత్సలు చేయగా.. అందుకు రూ.136కోట్లు, వైఎస్ఆర్ ఆరోగ్య ఆసరా కింద 14,439 మందికి రూ.7.42 కోట్లు, 2021-22లో 1,05,234 మందికి శస్త్రచికిత్సలు చేయగా.. అందుకు రూ.180కోట్లు, వైఎస్ఆర్ ఆరోగ్య ఆసరా కింద 25,247 మందికి రూ.11.60 కోట్లు వెచ్చించడం జరిగింది. అలాగే జిల్లాల పునర్విభజన తర్వాత చిత్తూరు జిల్లాలో డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీలో 2022-23 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 11,812 మందికి శస్త్ర చికిత్సలు చేయగా.. అందుకు రూ.23కోట్లు, వైఎస్ఆర్ ఆరోగ్య ఆసరా కింద 4,995 మందికి రూ.2.44 కోట్లు ఖర్చు చేయడమైనది.

వైద్య రంగంలో పలు సంస్కరణలు

జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు

రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యతను ఇస్తూ ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఆసుపత్రులలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై దష్టి సారించాము. పట్టణ,గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు సత్వర వైద్యసేవలు అందించేందుకు డాక్టర్ వైఎస్ హెల్త్‌క్లినిక్, పట్టణ ప్రాంతాలలో అర్బన్ హెల్త్‌సెంటర్స్ ఏర్పాటులో భాగంగా వీటి భవన నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతోంది. 104 వాహనసేవలు విస్తృతం చేస్తూ జిల్లాకు 13 104 వాహనాలు కొత్తవి వచ్చాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజకు హెల్త్‌క్లినిక్స్ పేరుతో ఇంటి వద్దకే వెళ్లి వైద్యసేవలు అందించడం జరుగుతోంది. అలాగే మరమ్మతులు పూర్తిగా ఉపయోగంలో లేని 108 వాహనాల స్థానంలో కొత్త వాహనాలు రాష్ట్ర ప్రభుత్వం తర్వలో జిల్లాలకు కేటాయించనుంది. ఈ మేరకు జిల్లాకు 108 వాహనాలు కొత్తవి వచ్చే అవకాశముంది.

పేదలకు వరం ఆరోగ్య శ్రీ

ఇ. కాలేషా, నాగాలమ్మ గుడి వీధి, చిత్తూరు

మేస్త్రీ పని చేసుకుంటూ జీవించే నాకు అకస్మాత్తుగా గుండె నొప్పి రావడంతో చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లడం జరిగింది. నా ఆరోగ్య పరిస్థితుల రీత్యా నన్ను స్విమ్స్ ఆసుపత్రికి పంపగా వైద్యపరీక్షలు అనంతరం బైపాస్ సర్జరీని ఆరోగ్యశ్రీ కింద చేశారు. డాక్టర్ల సూచనల మేరకు ఆసరా పథకం కింద రూ.10వేలు సాయం పొందాను. మాలాంటి ఎంతో మంది పేదలకు ఆర్యోగ శ్రీ ఒక వరం.

మెరుగైన వైద్యం అందిస్తున్నారు

- కె.వెంకటేష్, జి.డి నెల్లూరు

మాది గంగాధర్ నెల్లూరు మండలం ఒగ్గువారిపల్లె. జిడి నెల్లూరు నుండి చిత్తూరుకు టూవీలర్‌లో వచ్చే సమయంలో రోడ్డు ప్రమాదం జరిగింది. వెంటనే చిత్తూరు జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చేరగా వైద్యచికిత్సల అనంతరం కాలుకు ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నానని, డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య ఆసరా కింద రూ.10వేలకు అప్రూవల్ అయింది. నాకు వైద్యుతుల మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు.



జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు

అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి



ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాల్లో భాగంగా అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న ధ్యేయం అని గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నారాయణ స్వామి అన్నారు. మంగళవారం మండలంలో గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తయ్యూరు సచివాలయం పరిధిలోని బసివి రెడ్డి పల్లి శికారి కాలనీ, బీసీ కాలనీ, పెద్ద తయ్యూరు గ్రామాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సచివాలయం, రైతు భరోసా, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్, మొదలగు సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం ఇల్లు లేని నిరుపేద ప్రజలకు వెంటనే ఇంటి పట్టా మంజూరు చేయాలని, శ్మశానం లేని గ్రామాలకు స్మశాన వాటికను ఏర్పాటు చేయుటకు స్థలం సేకరించాలని, వ్యవసాయ రైతులకు మెరుగైన విద్యుత్ సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ వరదమ్మ, డిసిసిబి డైరెక్టర్ బాలసుబ్రమణ్యం రెడ్డి, జడ్పిటిసి రమణ ప్రసాద్ రెడ్డి, ఎమ్మార్వో లోకనాథ పిళ్లై, ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో కష్ణయ్య, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు దిలీప్ రెడ్డి, బలిజ సంఘ అధ్యక్షులు విజయబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన డిప్యూటీ సీఎం: మండలంలోని తయ్యూరు గ్రామపంచాయతీ పరిధిలో బసవరెడ్డిపల్లి శికారి కాలనీలో గతంలో ఇచ్చిన హామీని డిప్యూటీ సీఎం తాగునీరు మోటార్ బోరును ప్రారంభించి నట్లు సర్పంచ్ వరదమ్మ తెలిపారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న డిప్యూటీ సీఎం నారాయణ స్వామికి శికారి కాలనీవాసులు కతజ్ఞతలు తెలిపారు.



పంచాయతీకి తగ్గిన ఆదాయం



ప్రజాశక్తి-సోమల: గతేడాది కంటే ఈ ఏడాది దాదాపు రూ.27 వేల ఆదాయం తగ్గినట్లు ఎంపీడీఓ నాగరాజు తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు స్థానిక సచివాలయంలో వారపు సంత, ప్రైవేటు బస్టాండు నిర్వహణ కు ఎంపీడీఓ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ ఏడాది వారపు సంత రూ.5.23 లక్షలు పలకగా, గతేడాది రూ.5.50 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. అదేవిధంగా ప్రైవేటు బస్టాండు గత ఏడాది రూ.85 వేలు పలుకగా, ఈ ఏడాది రూ.83 వేలు పలికి రూ.2 వేలు ఆదాయం తగ్గిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పంచాయతీకి ఆదాయం తగ్గడంపై పలువురు చర్చించుకోవడం కనిపించింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్ కుమార్, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, వైసిపి నాయకులు, వేలం దారులు పాల్గొన్నారు.

గమ్యం చేరడానికి ధ్యానం అవసరం



ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రముఖ ఆధ్యాత్మిక, పిరమిడ్ ధ్యాన మందిరం హైదరాబాదు మనోహర్ ద్వారా మానసిక స్థైర్యాన్ని పెంపొందింపచేసే విధానాన్ని పిల్లలకు మంగళవారం తెలిపారు. ధ్యానం అందరికీ ఎలా, ఎందుకు అవసరమో పిల్లలకు వివరించారు. 'శ్వాస మీద ధ్యాస' ఉంచడం వలన మనిషికి శక్తి రీఛార్జ్ అవుతుందని తద్వారా గమనం చేరుకోవడానికి సులభం అవుతుందని ఆయన పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి జీవన నైపుణ్యాలను, ధ్యానం యొక్క ప్రయోజనాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విశ్రాంత విద్యాశాఖ అధికారి బండి జగదీశ్వర రెడ్డి, ప్రధానోపాధ్యాయులు పి వెంకటరమణారెడ్డి, పిరమిడ్ ధ్యాన మందిరం కార్యకర్తలు శ్రీ పేట భారతమ్మ,పేట భాను ప్రసాద్, పుత్తూరు మురళి రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్పొరేట్ స్థాయిలో వైద్యం




ప్రజాశక్తి-కార్వేటినగరం: పేద ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి రవిరాజు అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో టీబీ రోగులకు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి రవిరాజు, ఎంపీడీవో మోహన్ మురళి ఆధ్వర్యంలో పౌష్టికాహారంతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవిరాజు మాట్లాడుతూ ప్రజల ముంగిటకే వైద్యసేవలను అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. అనంతరం ఎంపీడివో మాట్లాడుతూ జిల్లాలో 1562 మంది టీబీ రోగులు ఉన్నారని, పోషకాహార లోపంతో టీబీ రోగం వ్యాప్తి చెందుతుందని, ప్రతి ఒక్కరూ మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సౌభాగ్య, మురళి, గోపినాద్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర విజిలెన్స్ విచారణ జరపాలి

ప్రజాశక్తి-పుంగనూరు: పవిత్రమైన తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి పాదాల చెంత గంజాయి, మాదకద్రవ్యాలు స్మగ్లింగ్ పై కేంద్ర విజిలెన్స్ కమిషన్ ద్వారా విచారణ జరిపించాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా కు రాష్ట్ర యువ నాయకుడు, వ్యాపారవేత్త బి రామచంద్ర యాదవ్ మంగళవారం లేఖ రాశారు. దేశంలోనే డ్రగ్స్ లభ్యతలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉండగా, పవిత్రమైన తిరుమలకు కూడా వ్యాప్తి చెందడం సిగ్గుచేటు అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఈ చర్యతో హిందువుల మనోభావాలు దెబ్బతింటున్నాయని, వాటిని తిరుమలకు చేర్చడం వెనుక కొందరు అధికార పార్టీ నాయకులు, పోలీస్ అధికారుల సహకారం లేకపోతే ఇది సాధ్యం కాదు అన్నారు. ప్రధానంగా సామాన్య భక్తులకు స్వామివారి దర్శనం కల్పించడం నుంచి టీటీడీ అభాసుపాలు చేస్తున్న ఈవో ధర్మారెడ్డిని తొలగించి, టిటిడి పాలకమండలిని వెంటనే రద్దు చేయాలి అని డిమాండ్ చేశారు. అధికారులు, నాయకుల ప్రోత్సాహం లేకపోతే తిరుమలకు డ్రగ్స్ వెళ్లడం సాధ్యం కాదని, పోలీస్, నిఘా వ్యవస్థలు ఏమి చేస్తున్నాయని ప్రశ్నించారు. యువతకు ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులు, చివరకు విద్యార్థులు కూడా డ్రగ్స్ కు బానిసలై జీవితాలను భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాశక్తి-పాలసముద్రం: ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మొబైల్ ఆధార్ కార్డు క్యాంపును గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి రాజకుమార్ సమక్షంలో నిర్వహిస్తున్నట్లు శ్రీ కావ్య రాజపురం సర్పంచ్ గాలి మహేష్ బాబు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ ఆధార్ కార్డులో వయస్సు, అడ్రస్ తదితర మార్పులు చేయుటకు ఆధార్ సెంటర్ కి వెళ్లి ప్రజలు అవస్థ పడకుండా స్వగ్రామంలోని గ్రామ సచివాలయంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆధార్ కార్డ్ క్యాంపు వారానికి ఒకరోజు ఉంటుందని, ఈ అవకాశాన్ని గ్రామస్తులందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ మోహన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన



ప్రజాశక్తి-పలమనేరు: ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవనాడి అయిన పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణంలో ఎత్తు తగ్గించడానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నందుకు వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు పలమనేరు రెవెన్యూ డివిజన్ కార్యాలయం ముందు భారత కమ్యూనిస్టు పార్టీ నియోజకవర్గ సమితి కార్యదర్శి ఎం సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు మాట్లాడుతూ 2014 రాష్ట్ర విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేపడతామని, పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించామని హామీ ఇచ్చి ప్రస్తుతం ప్రాజెక్టు ఎత్తును తగ్గించడానికి కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం చేస్తున్న విధానం చూస్తే రాష్ట్రంలోని 5 కోట్ల మంది ప్రజల్ని మోసం చేయడమేనన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే లక్షలాది ఎకరాలకు సాగునీరు సరఫరా అవుతుందని తద్వారా రైతులు పంటలు పండించుకొని మన రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని అన్నారు. ప్రాజెక్టు ఎత్తును తగ్గిస్తుంటే మన రాష్ట్ర సీఎం జగన్‌కు ఉలుకు, పలుకు లేదని వ్యంగ్యంగా విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కేసులకు భయపడి గట్టిగా నిలదీయలేకపోవడంతోనే నేడు 150 అడుగుల ఎత్తు నుండి 130 కు తగ్గించడం వల్ల ప్రాజెక్టు ఎత్తు తగ్గితే నీటి సరఫరా లేక రాయలసీమకు, ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం తగ్గించే ఆలోచన మానుకొని యధావిధిగా కొనసాగించాలని, నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని లేనిచో భవిష్యత్తులో ప్రజల ఆగ్రహాన్ని చవి చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. నిరసన అనంతరం రెవెన్యూ డివిజనల్ అధికారి పలమనేరు వారికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఏ గురప్పా, బంగారుపాళ్యం మండలం సిపిఐ నాయకులు కే రామమూర్తి, పార్టీ నాయకులు నందిని, నాగేశ్వరరావు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగడమే ప్రభుత్వ లక్ష్యం



ప్రజాశక్తి-పలమనేరు: మహిళలు ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, మహిళలు ఆర్థిక సాధికారత సాధిస్తే ఆ కుటుంబం, సమాజం అభివద్ధి చెందు తుందని ఎమ్మెల్యే ఎన్.వెంకటే గౌడ తెలిపారు. మంగళ వారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ ఛైర్ పర్సన్ పవిత్ర మురళీకష్ణ అధ్యక్షతన వైఎస్సార్ ఆసరా మూడవ విడత వారోత్సవాలకు జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరై 6732 లబ్ధిదారులకు రూ.7,71,31,127/-ల చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్య మంత్రి బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమచేశారన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలు సకాలంలో అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వా నిదే అన్నారు. ముఖ్యంగా మహిళల్లో ఉండే ఆర్థిక క్రమశిక్షణ వారి కుటుంబాలకు శ్రీరామరక్షగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ హేమంత్ కుమార్ రెడ్డి, వైసిపి పట్టణ కన్వీనర్ ఎస్ కే ఎస్ జాఫర్, వైసీపీ నాయకులు మురళీకష్ణ, మండి సుధా, మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఘనంగా వసంత్ కుమార్ పుట్టినరోజు వేడుకలు



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: చిత్తూరు నగరం మిట్టూరు మాజీ కార్పొరేటర్ వసంత్ కుమార్ పుట్టినరోజు వేడుకలను మంగళవారం పలువురు టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా తెలుగు యువత కార్య నిర్వాహక కార్యదర్శి దేవపత్ని ధనంజయ నాయుడు, పాచి గుంట పిఎస్ రఘునాథ నాయుడు, పార్లమెంట్ ఐటిడిపి ఉపాధ్యక్షుడు పిఎస్ మహేష్ నాయుడు, నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు టిడిపి నేతలతో కలిసి స్థానిక పెట్రోల్ బంక్ వద్ద వసంత్ కుమార్ కు ఘన స్వాగతం పలికి, అంబేద్కర్ విగ్రహం వరకు బ్యాండ్ సెట్ మేళాల మధ్య ర్యాలీగా తరలి వెళ్ళి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం టిడిపి మండల కార్యాలయం వద్ద మహిళలకు నేతలతో కలిసి వసంత్ కుమార్ చీరలు పంచిపెట్టారు. అనంతరం అన్న క్యాంటీన్లో పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు స్వామిదాస్, పార్లమెంట్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవసుందరం, క్లస్టర్ కన్వీనర్ శివప్రసాద్, నేతలు కిరణ్ నాయుడు, నియాజ్ అలీ, దీపక్ నాయుడు, గజేంద్ర నాయుడు, కోదం రెడ్డి, మునిరాజుల యాదవ్, నటరాజ్ మొదలి, ప్రసాద్ నాయుడు, హరి నాయుడు, నెల్లెపల్లి సుబ్రహ్మణ్యం, చిదంబరం, జీవరత్నం, ఆర్ముగం, గోపి, సంపత్, వినాయకం పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ 49 కొత్తపల్లి మిట్ట గ్రామానికి చెందిన టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జ్ గురునాథం, స్టాలిన్, డి గుణశేఖర్ మిట్టూరు మాజీ కార్పొరేటర్ వసంత్ కుమార్ ను శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



అందరివాడు మస్తాన్



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మాజీ కాంగ్రెస్ నేత పులి మస్తాన్ అందరివాడని ట్రస్టు బోర్డు ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు కొనియాడారు. పులి మస్తాన్ ఏడవ వర్ధంతిని పట్టణంలో మంగళవారం ఆయన కుమారుడు పులి శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా అంజూరు శ్రీనివాసులు హాజరై పులి మస్తాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కోటయ్య, షేక్ లాల్ హ్యూమన్, కన్నలి రమేష్, గుడారి మధు, కాగితాల మధు, పల్లమాల బాబు, కస్తూరయ్య పాలమణి, గురవయ్య, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

12న ఎన్‌బీకేఆర్ఐఎస్టీలో జాతీయ సదస్సు

ప్రజాశక్తి-కోట: విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ఐఎస్టీలో ఏప్రిల్ 12వ తేదీన సైన్స్ అండ్ హ్యుమనిటీస్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో సజనా 2023" అనే జాతీయ స్థాయి సదస్సును నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఇంజినీరింగ్‌లో గణితశాస్త్రానికి సంబంధించిన ఉపయోగాలు, భౌతిక, రసాయన శాస్త్రాలకు సంబంధించిన వ్యాసాలను ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రదర్శనలో ఉత్తమ వ్యాసాలకు ప్రథమ, ద్వితీయ బహుమతులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ సి.రవీంద్రారెడ్డి, సదస్సు కన్వీనర్ డాక్టర్ యం.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



కాంట్రాక్టు కార్మికులను పనిలో పెట్టుకోవాలి



ప్రజాశక్తి-రేణిగుంట: రైల్వే కాంట్రాక్టు కార్మికుల రాష్ట్ర కార్యదర్శి సీవీఎల్ నర్సింహులు సీఆర్ఎస్‌లో తొలగించబడ్డ కార్మికులను మంగళవారం తిరుపతిలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 ఏళ్లగా పనిచేస్తున్న 35 మంది కార్మికులను తొలగించడం దారుణమన్నారు. 80 మంది కార్మికులు పనిచేస్తుండగా 35 మందిని తొలగించడంతో శుభ్రత లోపించిందని.. వెంటనే కాంట్రాక్టు కార్మికులను తిరిగి పనిలోకి తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం, మునిరాజ, నర్సింహారెడ్డి, మహాలక్ష్మి, శ్యామ్, కుప్పస్వామి, శివానందం, వెంకట రమణ కార్మికులు పాల్గొన్నారు.

బొజ్జల కుటుంబంపై పరుష భాష సిగ్గుచేటు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: బొజ్జల కుటుంబంపై కొందరు వైసీపీ నేతలు పరుష పదజాలాన్ని వాడటం సిగ్గుచేటని టీడీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాదిపాకుల గోపినాథ్, ఎస్టీ విభాగం తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు సుబ్బయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారిని ప్రజలు క్షమించరని హెచ్చరించారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం మీడియాతో మాట్లాడారు. శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి అనుబంధంగా శ్రీకాళహస్తిలో ఉన్న శ్రీ ప్రసన్న వరదరాజస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా మూల విరాట్టు తొలగించేటపుడు విపక్ష పార్టీలకు సమాచారం లేదని, అక్కడ దొరికిన బంగారు నాణేలు వివరాలు ప్రజలకు తెలియ చేయలేదని, వీటిని రహస్యంగా విక్రయించే అవకాశం ఉందని తమ నేత బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అనుమానం వ్యక్తం చేశారన్నారు. ఇలా ప్రతిపక్ష నేత అనుమానం వ్యక్తం చేసినపుడు వాస్తవాలు నిరూపించుకోవాల్సిన బాధ్యత ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలిపై ఉందన్నారు. అయితే వారు అలా చేయకుండా బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని, వారి కుటుంబ సభ్యులను పరుష పదజాలంతో దూషించడం వారి సంస్కార హీనతకు నిదర్శనమన్నారు. ఇకపై ఇలాంటి పరుష పదజాలంతో బొజ్జల కుటుంబ సభ్యులను విమర్శిస్తే క్షమించమని వారు హెచ్చరించారు. ప్రజలే వీరికి తగిన సమయంలో గుణపాఠం చెబుతారని తెలిపారు.

వార్షిక సర్వే రిటర్న్‌ల దాఖలుపై వర్క్‌షాప్





ప్రజాశక్తి-వరదయ్యపాళెం: కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ పరిధిలోని కేంద్ర గణాంకాల కార్యాలయం (ఫీల్డ్ ఆపరేషన్స్ డివిజన్, కడప) ఆధ్వర్యంలో మంగళవారం శ్రీసిటీలో వర్క్‌షాప్ జరిగింది. ఇందులో సంబంధిత పోర్టల్‌లో రిటర్న్‌ల దాఖలకు అవసరమైన డేటా సేకరణ, ఇతర ప్రక్రియలపై వివరించారు. శ్రీసిటీలోని అన్ని పరిశ్రమల అకౌంట్స్ మేనేజర్లు వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ రమేష్ కుమార్, రీజినల్ డైరెక్టర్ ఏ ఎస్ ఎన్ ఎం.రావు, ఏఎస్ఎన్ఎం రావు, సీనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్లు జి.శ్రీనివాసరావు, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

వార్షిక క్రీడా దినోత్సవ గోడపత్రికల ఆవిష్కరణ



ప్రజాశక్తి-కోట: స్థానిక ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం వార్షిక క్రీడా దినోత్సవ గోడపత్రికలను వ్యాయామ విద్య విభాగాధిపతి డాక్టర్ వి.మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గత నెలరోజులుగా పోటీలను నిర్వహించామని, ఏప్రిల్ 1, 2 తేదీలలో తుది పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 4 న నిర్వహించే వార్షిక క్రీడా సమావేశంలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు మున్సిపల్ అత్యవసర సమావేశం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: కార్వేటినగరం రోడ్డులోని వైఎస్ఆర్ భవనంలో బుధవారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎంఎన్ రెడ్డి తెలిపారు. సమావేశానికి వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు తప్పక హాజరు కావాలని కోరారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి



ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్ : స్థానిక మెసానికల్ క్రీడా మైదానం సమీపంలో గుర్తు తెలియని వృద్ధుడు ఉరి వేసుకొని మృతి ఆచేతన స్థితిలోపడి ఉండడాన్ని గుర్తించిన స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు పిర్యాదు చేశారు. ఈ మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గుర్తు తెలియని మృతదేహంగా కేసునమోదు చేసి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాషాయి రంగ దుస్తులు వేసుకున్న వృద్ధుడి వయసు 50 నుండి 55 సంవత్సరాలుంటుందని ఆచూకి తెలిసిన వారు ఫోన్ నెంబర్ 9440796705 కు తెలియజేయాలని కోరారు.

సీఎం మహిళా పక్షపాతి



ప్రజాశక్తి-గుడిపల్లి: సీఎం జగన్‌మోహన్ రెడ్డి మహిళా పక్షపాతి అని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా 3వ విడత వారోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఆసరా చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం మహిళా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలోని అక్కా, చెల్లమ్మల ఆనందమే ధ్యేయంగా సీఎం పాలన అందిస్తున్నారన్నారు. మండల వ్యాప్తంగా మహిళా సంఘాల గ్రూపులకు వైఎస్సార్ ఆసరా 3వ విడతలో రూ.7.17 కోట్ల చెక్కును అందించారు. అనంతరం మహిళలతో కలిసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కష్ణమూర్తి, ఎంపీపీ వరలక్ష్మి గోపి, సర్పంచులు రామ్మూర్తి, మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు



ప్రజాశక్తి-కార్వేటినగరం: ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దని మండల విద్యాశాఖ అధికారి బాబయ్య తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని సుద్దగుంట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సహకారంతో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ ప్రత్యేక వైద్య శిబిరంలో డాక్టర్ గోపీనాథ్ వైద్యుల బందం 58 మందికి పరీక్షలు నిర్వహించి సూచనలు, మందులు అందించారు. అనంతరం బాబయ్య మాట్లాడుతూ ప్రభుత్వ విద్యావ్యవస్థ ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్రభుత్వ విద్యావ్యవస్థకు సహకరించాలని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎస్ విజయులు రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ధనంజయ రెడ్డి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, సుద్దగుంట గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు వారపుసంత వేలం

ప్రజాశక్తి-సోమల: మండలంలోని కందూరు గ్రామంలో వారపు సంత, ప్రైవేటు బస్టాండు నిర్వహణకు బుధవారం పంచాయతీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు 2023-24 సంవత్సరానికి వేలం నిర్వహిస్తున్నట్లు సర్పంచి భాష మసూద్ తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు పంచాయతీ నిబంధనల మేరకు డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు పంచాయతీ కార్యదర్శి జయశంకర్ ను సంప్రదించవచ్చని తెలిపారు.

నూతన కార్యవర్గం ఎంపిక



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలోని వెలుగు ఆఫీస్‌లో మంగళవారం సంఘమిత్రాల సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండలంలో చురుగ్గా సాగుతున్న 43 సంఘాలకు సంబంధించిన సభ్యులను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో సంఘ మిత్రాల అధ్యక్షురాలుగా తిరుమల కవిత (నెల్లిపట్ల), కార్యదర్శి వి.భువనేశ్వరి (కామినేపల్లి), కోశాధికారి కె.సావిత్రమ్మ (రామనపల్లి), ఉపాధ్యక్షుడు ఎల్.లక్ష్మన్న (దాసర్లపల్లి), సహాయ కార్యదర్శి ఎస్. జౌహర్ బాషా(లక్కనపల్లి), జిల్లా కార్యదర్శి పి.నాగరాజు (దేవదొడ్డి) ఎన్నికయ్యారు. వీరి ఎన్నికపై సంఘాల సభ్యులు, వెలుగు సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు తిరుమల కవిత మాట్లాడుతూ తమ పరిధిలోని సంఘాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామన్నారు. మండలంలో కొనసాగుతున్న వెలుగు గ్రూపుల సభ్యులు సహాయ సహకారాలు అందివ్వాలని కోరారు.